# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 074

పేజీలు : 08 | వెల: రూ.5/-

బుధవారం

మార్చి 04, 2026

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## ఘనంగా వివాహ వార్షికోత్సవం



మణుగూరు జెన్ కోలో విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ, ఫైర్ విభాగం డీఎస్పీగా పనిచేస్తున్న నలుబోల రమేష్, న్యాయవాది నాగలత దంపతుల వివాహ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. వీరి 27వ పెళ్లిరోజు కార్యక్రయంలో చిన్ననాటి మిత్రులు పాల్గొని సందడి చేశారు. వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, పూజారి విజయ్ కుమార్, మైదంశెట్టి సాంబయ్య తదితరులు వీరికి పూల బోకేను అందజేసి శాలువాతో సత్కరించారు.

–వరంగల్ వాయిస్, హనుమకొండ




## రంగుల కేళి.. ఆనంద హోలీ

వసంత కాలపు రంగుల పండుగ హోలీ వేడుకలను మామిడి శ్రీదీప్ బుధవారం అత్యంత ఉత్సాహంగా జరుపుకున్నారు. తను చదువుకుంటున్న పాఠశాలలో నిర్వహించిన హోలీ వేడుకల్లో పాల్గొని స్నేహితులతో కలిసి రంగులు పూసుకున్నారు.

–వరంగల్ వాయిస్, హనుమకొండ




8లో..

## 6నుంచి ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష



2లో..

## పరకాల మా అడ్డా

- సుస్మిత ఇక్కడి నుంచే పోటీ చేస్తుంది
- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి



# ఆట స్థలం కబ్జా

## దానంగా ఇచ్చిన భూమిపై కన్ను

- అంబేద్కర్ విగ్రహం ముసుగులో ఆక్రమణలకు కుట్ర
- తాళ్లతో లాగి రాజ్యాంగ నిర్మాతకు అవమానం
- 1976 లో కాకతీయ యూత్ క్లబ్ ఆట స్థలంగా రికార్డు
- అడ్డుకున్న వారిపై దాడులు
- ఆట స్థలాన్ని రక్షించాలంటూ తహసీల్దార్ కు వినతి



వివరాలు2లో..

కాకతీయ యూత్ క్లబ్ ఆట స్థలంపై కబ్జాకోరులు కన్నేశారు. దానంగా ఇచ్చిన భూమి అని తెలిసినప్పటికీ దర్జాగా ఆక్రమించేందుకు పథకం రూపొందించారు. 1976లోనే కాకతీయ యూత్ క్లబ్ పేరిట రిజిస్ట్రేషన్ కావడంతోపాటు పహానిసైతం క్లబ్ పేరిట ఉన్నప్పటికీ అడ్డదారిలో కబ్జాకు యత్నిస్తున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ ముసుగులో అపచారం చేస్తున్నారు. గౌరవంగా తీసుకురావాల్సిన ఆయన విగ్రహాన్ని తాళ్లు కట్టి లాగుతూ తీసుకురావడం వివాదాస్పదంగా మారింది. ఇది చాలదన్నట్లు మోకాళ్లలోతు గొయ్యి తవ్వి అందులో అడ్డదిడ్డంగా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం విమర్శలకు కారణమవుతోంది. ఇందులో అంబేద్కర్ మీద ప్రేమకంటే అత్యంత విలువైన ఆట స్థలాన్ని ఆక్రమించాలన్న వారి ఉత్సాహం కన్నులకు కట్టినట్లు కనిపిస్తోంది. అయితే ఆట స్థలం ఆక్రమణపై ఆగ్రహించిన స్థానికులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా వారిపై కబ్జాకోరులు దాడికి యత్నించినట్లు తెలిసింది. దీనిపై స్పందించిన కాకతీయ యూత్ గౌరవ అధ్యక్షులు గడ్డం నాగార్జున స్థానికులతో కలిసి విలువైన ఆట స్థలాన్ని కాపాడాలంటూ బుధవారం కేసముద్రం తహసీల్దార్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

- వరంగల్ వాయిస్, కేసముద్రం

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, మార్చి 04, 2026

# ఆట స్థలం..కబ్జా

- దానంగా ఇచ్చిన భూమిపై కన్ను
- అంబేద్కర్ విగ్రహం ముసుగులో ఆక్రమణలకు కుట్ర
- తాళ్లతో లాగి రాజ్యాంగ నిర్మాతకు అవమానం
- 1976 లో కాకతీయ యూత్ క్లబ్ ఆట స్థలంగా రికార్డు
- అడ్డుకున్న వారిపై దాడులు
- ఆట స్థలాన్ని రక్షించాలంటూ తహసీల్దార్ కు వినతి




**వరంగల్ వాయిస్, కేసముద్రం :** యాభై సంవత్సరాల క్రితం దానంగా ఇచ్చిన భూమిపై కొందరు కబ్జా దారుల కన్ను పడింది. అక్రమించుకునేందుకు అడ్డదారుల్లో సాగుతున్నారు. కాదు కూడదన్న వారిపై భౌతిక దాడికి దిగుతున్నారు. అడ్డు వస్తే అంతుచూస్తామంటూ హెచ్చరిస్తున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు ముసుగులో అక్రమాలకు శ్రీకారం చుట్టారు.

**39 గుంటలు..**

కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన కొందరు కాకతీయ యూత్ క్లబ్ పేరిట ఒక సంస్థను 1976లో ఏర్పాటు చేశారు. దీనిలో ఉన్న 200 మంది సభ్యులంతా కలిసి 1070/1989 నెంబర్ తో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అయితే వీరిలో క్రీడాస్ఫూర్తిని నింపేదుకు వీలుగా కాట్రపల్లి గ్రామానికి చెందిన పాల్వాయి ధర్మారెడ్డి కుమారుడు రాగోత్తం రెడ్డి సర్వే నెంబర్ 323లోని 39 గుంటల భూమిని దానంగా ఇచ్చారు. ఈ భూమిలో ఒక గది ఉండదా దానికి 2-68/6 ఇంటి నెంబర్ కేటాయించారు. పట్టాదారు పాసు పుస్తకం పహాణీలోను 39 గుంటలకు హక్కుదారులుగా కాకతీయ యూత్ క్లబ్ ఉంది. ఈ భూమిని ఆట స్థలంగా వినియోగించుకుంటూ గ్రామ పంచాయతీకి అన్ని విధాలుగా పన్నులు చెల్లిస్తున్నట్లు ప్రకటిస్తున్నారు.

**ఆక్రమణలకు కుట్ర..**

ఆట స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు కుట్ర పన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ఈ భూమిని దానంగా ఇచ్చినట్లు తెలిసినట్లు కుట్రలకు తెరలేపారు. ఫిబ్రవరి నెలలోనే ఈ భూమిలో బోరు పిల్లర్లు వేశారు. దీంతో పలువురు క్రీడాకారులతోపాటు కాకతీయ యూత్ క్లబ్ కమిటీ సభ్యులు అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న ఆట స్థలం దగ్గరికి వెళ్లి వారి ప్రయత్నాలను నిలువరించారు. యూత్ ఆట స్థలంలో పిల్లర్లు వేయరాదంటూ బ్రతిమిలాడినా దౌర్జన్యంగా వ్యవహరించినట్లు పలువురు చెప్పుకొంటున్నారు.

**అంబేద్కర్ కు అవమానం..**

మా కుల సంఘానికి ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నట్లు చెప్పుకుంటున్న కొందరు కబ్జా కోరులు భారత రాజ్యాంగ నిర్మాతకు అపచారం చేస్తున్నారు. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ ముసుగులో ఆట స్థలాన్ని మొత్తం కబ్జా చేసేందుకు యత్నించారు. వారి స్వార్థం కోసం బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని తాళ్లతో కట్టి ఇష్ట రీతిగా గుంజుకొని వచ్చి మోకాళ్ళ లోతు గొయ్యి తవ్వి అందులో విగ్రహం ఏర్పాటుచేసి అంబేద్కర్ ని అవమానించారు.

### ఆట స్థలాన్ని రక్షించండి..

**- గడ్డం నాగార్జున, యూత్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు**

యాభై సంవత్సరాల క్రితం ఆట స్థలానికి కేటాయించిన 39 గుంటల భూమిని ఆక్రమించేందుకు జల్లే యాకాంబరం, జల్లే విజేందర్, జల్లే అనీల్ లు కుట్రలు చేస్తున్నారని కాకతీయ యూత్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గడ్డం నాగార్జున ఆరోపించారు. ఆపేందుకు ప్రయత్నించిన మాపైకి ఎస్సీ కాలనీ మహిళలను ఉసిగొలుపుతూ నానా బూతులు తిట్టిస్తున్నారన్నారు. మా యూత్ స్థలంలో మేము మొరం పోస్తుంటే ఆపి మాపై దాడి చేయడానికి ప్రయత్నం చేశారన్నారు. మా యూత్ ఆటస్థలాన్ని కబ్జా చేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకొని మా ఆట స్థలాన్ని కబ్జా కోర్ల నుంచి కాపాడాలని ఆయన కోరారు. ఈ మేరకు బుధవారం కేసముద్రం తహసిల్దార్ కి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు తహసిల్దార్ సానుకూలంగా స్పందించి మీ గ్రౌండ్ ని మీకే ఉంచే విధంగా చర్యలు చేపడతామని, ఇతర వ్యక్తులు రాకుండా చేస్తామని హామీ ఇచ్చినట్లు నాగార్జున వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నల్లగొప్పుల రాజేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ హరీష్, యూత్ క్లబ్ సభ్యులు నారాయణ, గంగపురం రవి, ఎదురబోయిన శ్రీకాంత్, బూర సురేష్, గడ్డం రాజు, కట్ట యాకయ్య మాధవ పెద్ది రాజేష్ రెడ్డి, బేతు సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

## పరకాల మా అడ్డా

- సుస్మిత ఇక్కడి నుంచే పోటీ చేస్తుంది
- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పరకాల మా అడ్డా.. వచ్చే ఎన్నికల్లో కొండా సుస్మిత ఇక్కడి నుంచే పోటీ చేస్తుందని మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం గీసుగొండ మండలంలోని కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి జాతరలో కొండా మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తన బిడ్డా కొండా సుస్మిత ఎవరినైనా ఎదిరిస్తుందని చెప్పుకొచ్చారు. తనకన్నా కొండా సుస్మిత ధైర్యవంతురాలని తేల్చి చెప్పారు. కార్యకర్తలకు సమస్య వస్తే ఎవర్నీ వదలిపెట్టదన్నారు. ఎంతటివారినైనా ధైర్యంగా ఎదుర్కొంటుందని కొండా మురళి కితాబిచ్చారు.

**ఘనంగా ప్రభల ఊరేగింపు..**

వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొమ్మాల శ్రీ లక్ష్మీ లక్ష్మీనరసింహస్వామి ప్రభల ఊరేగింపు బుధవారం కన్నుల పండువగా సాగింది. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పలు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు ప్రభలతో సందడి చేశారు. కాగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు చెందిన ప్రభలకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. దీంతో డప్పు చప్పుల్లు, డీజే మోతలు, మహిళల కోలాటాల నడుమ ప్రభ బండ్లు ముందుకు సాగాయి. అయితే గతేడాది కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య జరిగిన ఘర్షనను దృష్టిలో పెట్టుకొని పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రభల ముందు ఆట పాటలతో నృత్యాలు చేశారు. అయితే బాణాసంచా పేల్చడంతో నిప్పు కణిక ఎగిరిపడి బీఆర్ఎస్ కు చెందిన ప్రభ కాలిపోయినట్లు నెట్టింట వైరల్ అవుతోంది.



## పన్ను వసూళ్లపై సమీక్ష

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలో వంద శాతం పన్ను వసూళ్లు జరగాలని బల్దియా కమిషనర్, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా సమీకృత కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో బల్దియాకు చెందిన రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లతో పన్ను వసూళ్ల పురోగతిపై కమిషనర్ సమీక్షించారు. పన్నులు సమర్థవంతంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. పన్ను వసూళ్లలో అలసత్వం తగదన్నారు. ప్రతి అధికారి తనకు కేటాయించిన టార్గెట్ లను పూర్చి చేయాలన్నారు.



## ఆచార్య జ్యోతి పదవి కాలం పొడిగింపు

**వరంగల్ వాయిస్, కేయూ :** సుబేదారి, హనుమకొండ, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్సు కాలేజీ ప్రిన్సిపాల్ గా రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు ఆచార్య ఎస్.జ్యోతి పదవి కాలాన్ని మరో సంవత్సరం పొడిగిస్తూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య జ్యోతి ఈమేరకు ఉత్తర్వులు అందుకున్నారు. పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆచార్య జ్యోతిని అభినందించారు.

# భద్రకాళిని దర్శించుకున్న ఏపీ జస్టిస్

**మంగళవాద్యాలతో ఘనస్వాగతం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్. మానవేంద్రనాథ్ రాయ్ సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ ధర్మకర్త తొనుపునూరి వీరన్న, అధికారులు వేదస్వస్తి, మంగళవాద్యాలతో ఘనస్వాగతం పలికారు. ముందుగా ఆదిశంకరాచార్యులను, వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం అర్చకులు టక్కర్లు సత్యం ఆధ్వర్యమున అర్చకులు, వేద విద్యార్థులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కోర్టుకు చెందిన పలువురు న్యాయమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..**

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తన జన్మదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి ఆలయ అధికారులు, ధర్మకర్తలు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. పూజానంతరం ఆలయ స్నపన మండపంలో అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ సందర్భంగా టీఎన్ జీఓ వరంగల్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, పలువురు యూనియన్ నాయకులు, కార్పొరేటర్ జన్ను షీబారాణి-అనిల్ తదితరులు దుశ్శాలువలతో సత్కరించి పుష్పగుచ్ఛములు అందజేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత తెలిపారు.





# ఉమామహేశ్వర్ సేవలు చిరస్మరణీయం

■ ధర్మసాగర్‌లో ఘనంగా స్మారక సభ

**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** ధర్మసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, స్వర్గీయ మెండు ఉమామహేశ్వర్ స్మారక సభ మంగళవారం స్థానిక పాఠశాల ఆవరణలో అత్యంత భావోద్వేగభరితంగా జరిగింది. పాఠశాల కాంప్లెక్స్ హెచ్.ఎం. కేబీ.ధర్మప్రకాశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు ఘన నివాళులర్పించారు.సభ ప్రారంభంలో ఉమామహేశ్వర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డా.రామ్‌ధన్ (మండల విద్యాధికారి, ధర్మసాగర్), మురళి (గెజిటెడ్ హెడ్ మాస్టర్, జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల), శ్రీనివాస్ (గెజిటెడ్ హెడ్ మాస్టర్, ఉనికిచర్ల), లక్ష్మి మనోహర్ స్వామి (స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ కో–ఆప్షన్ సభ్యులు), జ్యోతి ఎలియా (ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్) పాల్గొన్నారు. సభలో ప్రసంగించిన వక్తలు ఉమామహేశ్వర్ వ్యక్తిత్వాన్ని, వృత్తి పట్ల ఆయనకున్న నిబద్ధతను కొనియాడారు. ఆయన కేవలం ఉపాధ్యాయుడిగానే కాకుండా, సాహిత్యం మరియు మనోవిజ్ఞాన



శాస్త్రంపై పట్టున్న మేధావిగా విద్యార్థులను తీర్చిదిద్దారని పేర్కొన్నారు. విద్యార్థుల పట్ల ఆయన చూపిన మమకారం, క్రమశిక్షణతో కూడిన బోధనా శైలి ఎందరికో ఆదర్శమని వక్తలు అన్నారు. తమ గురువును స్మరించుకుంటూ పూర్వ విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. "మా జీవితాలకు దారి చూపిన దీపస్తంభం ఉమామహేశ్వర్ సార్" అని వారు భావోద్వేగంతో పేర్కొన్నారు. ఆయన నేర్పిన విలువలు, సాదాసీదా జీవనం తమకు నిరంతరం స్ఫూర్తినిస్తాయని వారు సంకల్పించారు. చివరగా, ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తూ సభ ముగిసింది. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు.

# టెస్కో నుంచే నేరుగా కొనుగోలు చేయాలి

◆ టెండర్లతో వస్త్రాల సేకరణను నిలిపివేయాలి
◆ ఆందోళనలో చేనేత కార్మికులు
◆ సీఎంకు 'ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్' విన్నపం



ALL INDIA WEAVERS FEDERATION
TELANGANA STATE COMMITTEE

**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలకు అవసరమైన బెడ్ షీట్లు, దుప్పట్లను టెస్కో ద్వారా కాకుండా, టెండర్ల ద్వారా సేకరించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై చేనేత కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు 'ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్' ప్రతినిధులు ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ టెండర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, ప్రభుత్వ కార్యాలయాలు, గురుకుల పాఠశాలలకు అవసరమైన వస్త్రాలన్నీ టెస్కో ద్వారానే కొనుగోలు చేయాలని జీవో నెం.1 (11.2.2024) ద్వారా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఇటీవల సాంఘిక సంక్షేమ శాఖ సెక్రటరీ ప్రభుత్వ నిబంధనలను పక్కనబెట్టి, టెండర్ల ద్వారా వస్త్రాల సేకరణకు మొగ్గు చూపడంపై ఫెడరేషన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు లక్ష కుటుంబాలు చేనేత వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాయని పేర్కొన్నారు. టెండర్ విధానం ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి నాణ్యత లేని వస్త్రాలు వచ్చే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. ఇప్పటికే రుణమాఫీ కాక, అనేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న చేనేత కార్మికులకు ఈ నిర్ణయం 'ములిగే నక్కపై తాటిపండు' పడ్డ చందంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత పరిశ్రమను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, టెండర్ విధానాన్ని రద్దు చేసి గతంలో లాగే టెస్కో ద్వారా వస్త్రాలు సేకరించాలని వారు కోరారు. ప్రభుత్వం స్పందించని యెడల, లక్షలాది మంది కార్మికులతో కలిసి రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ హెచ్చరించింది. వినతిపత్రం అందజేసిన వారిలో ఫెడరేషన్ నేతలు అత్తిని

# రోళ్లకల్‌లో వరుస దొంగతనాలు

పోలీసులకు గ్రామ పాలకవర్గం ఫిర్యాదు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని రోళ్లకల్ గ్రామ పంచాయతీ పరిధిలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న వరుస దొంగతనాలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు ప్రభుత్వ ఆస్తులతో పాటు ఆలయ సామాగ్రిని అపహరిస్తుండటంతో, గ్రామ పాలకవర్గం బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గ్రామస్తులు, పాలకవర్గ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం దొంగలు పెద్ద ఎత్తున సొత్తును అపహరించారు. గ్రామంలోని శివాలయం నుంచి సుమారు రూ.50 వేల విలువైన సోలార్ బ్యాటరీలు, వీధి దీపాలను దొంగిలించారు. చెరువు ముందు తండా వద్ద ఒకటి, గ్రామ పంచాయతీ కార్యాలయం ముందున్న బోర్ మోటార్ ఒకటి, ఒక నివాస గృహం వద్ద ఉన్న మరొక మోటార్.. ఇలా మొత్తం మూడు మోటార్లను అపహరించుకుపోయారు. ఒకే గ్రామంలో వరుసగా దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ఘటనలపై తక్షణమే దర్యాప్తు జరిపి, నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ పాలకవర్గం పోలీసులను కోరింది. గ్రామంలో రాత్రిపూట గస్తీ పెంచాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభిస్తామని, అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచుతామని హామీ ఇచ్చారు.

# చిన్నారుల ఆరోగ్యమే గ్రామ భవిష్యత్తు

• సర్పంచ్ విజయలక్ష్మి భాస్కర్ నాయక్

**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** చిన్నారులకు సరైన పునాది వేయడమే అంగన్వాడీల ముఖ్య ఉద్దేశ్యమని, వారి ఆరోగ్య విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని గోరుగుట్ట తండా సర్పంచ్ విజయలక్ష్మి భాస్కర్ నాయక్ స్పష్టం చేశారు. మండల పరిధిలోని జగ్గు తండా అంగన్వాడీ కేంద్రాన్ని ఆమె బుధవారం ఆకస్మికంగా సందర్శించి, అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల కోసం అందిస్తున్న పాలు, గుడ్లు, బాలామృతం వంటి పోషకాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో లభించే పౌష్టికాహారం వల్ల తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. పిల్లల ఎదుగుదలపై అంగన్వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె ఆదేశించారు. చిన్నారుల బరువు, ఎత్తులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఎవరైనా అనారోగ్య సమస్యలతో ఉన్నట్లు గుర్తిస్తే, వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రం సందర్శనలో భాగంగా, కిటికీలకు చెదలు పట్టి ఉండటాన్ని గమనించిన సర్పంచ్ వెంటనే స్పందించారు. పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకుని, పాడైపోయిన కిటికీలను తొలగించి, వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టాలని ఆదేశించి, స్వయంగా పనులను పర్యవేక్షించారు. ప్రభుత్వ లక్ష్యాలను నెరవేరుస్తూ, అంగన్వాడీ కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.



# మెండు ఉమామహేశ్వర్ కన్నుమూత



**వరంగల్ వాయిస్, హనుమకొండ/ పరకాల:** విద్యావేత్తగా, జర్నలిస్టుగా, కవిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుగాంచిన మెండు ఉమామహేశ్వర్ (గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు) అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. పరకాలకు చెందిన ఆయన ప్రస్తుతం హనుమకొండలో నివాసముంటున్నారు. ఆయన మృతి పట్ల విద్యా, సాహిత్య, జర్నలిజం రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఉమామహేశ్వర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉపాధ్యాయుడిగా విశిష్ట సేవలందించారు. గతంలో చల్లగరిగె, కొప్పుల, నర్సక్కపల్లె గ్రామాల్లో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ప్రస్తుతం ధర్మసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైనప్పటికీ, ప్రవృత్తిగా జర్నలిజంపై ఉన్న మక్కువతో ఆయన దశాబ్దాల క్రితమే ఈ రంగంలో అడుగుపెట్టారు.1986లో పరకాల విలేఖరిగా 'ఉదయం' పత్రికలో పనిచేశారు. 1990లో శాయంపేట విలేఖరిగా 'ఈనాడు' పత్రికలో సేవలందించారు. కవిగా, రచయితగా కూడా ఆయన సాహిత్య సమాజంలో సుపరిచితులు. ఉమామహేశ్వర్ సోదరుడు, ప్రముఖ జర్నలిస్ట్ మెండు శ్రీనివాస్ (హైదరాబాద్ ఆంధ్రజ్యోతి చీఫ్ బ్యూరో) నాలుగేళ్ల క్రితమే మృతి చెందారు. ఇప్పుడు ఉమామహేశ్వర్ మరణంతో ఆ కుటుంబంలో మరోసారి విషాద ఛాయలు అలముకున్నాయి.

# ట్రాఫిక్ చలాన్లపై వదంతులు నమ్మొద్దు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 14న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో పెండింగ్ ట్రాఫిక్ చలానాలపై భారీ డిస్కౌంట్లు ఉంటాయని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని పోలీస్ శాఖ తీవ్రంగా ఖండించింది. కొంతమంది వ్యక్తులు వీడియోల ద్వారా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని, అటువంటి ప్రచారాలను నమ్మవద్దని అధికారులు స్పష్టం చేశారు. ట్రాఫిక్ చలానాలపై డిస్కౌంట్ ఇచ్చే విషయంలో ప్రభుత్వం లేదా పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి ఇప్పటివరకు ఎటువంటి ఉత్తర్వులు జారీ కాలేదని పోలీసులు తెలిపారు. ఒకవేళ అటువంటి రాయితీలు ఉంటే అధికారికంగా పత్రికా ప్రకటన లేదా సోషల్ మీడియా వేదికల ద్వారా తామే వెల్లడిస్తామని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రానున్న రోజుల్లో అమల్లోకి రానున్న కఠినమైన ట్రాఫిక్ నిబంధనలను దృష్టిలో ఉంచుకుని వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్త నిబంధనల ప్రకారం పెండింగ్ చలానాలు ఉంటే వాహనాలను నిలిపివేయడం జరుగుతుంది. డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు అయ్యే అవకాశం ఉంది. పెండింగ్ చలానాలు ఉంటే వాహన యజమాని పేరు మార్పు ప్రక్రియ సాధ్యం కాదు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించి అనవసరంగా జరిమానాల బారిన పడవద్దని కోరారు. "ట్రాఫిక్ రూల్స్ పాటించండి.. ప్రమాదాల నుంచి మిమ్మల్ని మీరు రక్షించుకోండి. మీ వెనుక మీ కుటుంబం ఉందని గుర్తుంచుకోండి" అని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పెండింగ్ లో ఉన్న చలానాలను ఎటువంటి గందరగోళానికి గురికాకుండా వెంటనే చెల్లించి బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని కోరారు.

# నూతన పంచాంగం ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** మండలంలోని క్యాతంపల్లి గ్రామంలోని నవనాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో బుధవారం నూతన పంచాంగ ఆవిష్కరణ కార్యక్రమం వైభవంగా జరిగింది. గంట పవన్ కుమార్ సారథ్యంలో రాబోయే 'పరాభవ' నామ సంవత్సర ఉగాది నూతన పంచాంగాన్ని ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేందర్ శర్మ, బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు మోత్కూరి రామేశ్వరరావు హాజరయ్యారు. వేద మంత్రోచ్చారణల మధ్య వారు నూతన పంచాంగాన్ని ఆవిష్కరించి, భక్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు. దేవాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు, నూతన సంవత్సరంలో అందరికీ శుభం కలగాలని ఆకాంక్షించారు. పంచాంగ శ్రవణం, ఆవిష్కరణల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో జాగర్లపూడి వీరభద్ర శర్మ, సాయి కృష్ణ శర్మ, శ్రవణ్ కుమార్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ రమణారెడ్డి, టక్కర్స్ రఘునాథరావులతో పాటు పలువురు ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

# బాధ్యతలపై నిర్లక్ష్యం?

➲ శిక్షణకు వార్డు సభ్యుల గైర్హాజరు

**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** గ్రామ స్థాయి పాలనపై పట్టు సాధించేందుకు, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకునేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను కొందరు వార్డు సభ్యులు గాలికి వదిలేస్తున్నారు. పర్వతగిరి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమానికి ఆశించిన స్పందన కరువైంది. ప్రజాప్రతినిధులుగా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన వారు.. శిక్షణ పట్ల చూపుతున్న ఉదాసీనతపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొదటి విడతలో భాగంగా మండలంలోని 10 గ్రామాల నుంచి మొత్తం 98 మంది వార్డు సభ్యులు హాజరుకావాల్సి ఉంది. అయితే తొలి రోజు కేవలం 60 మంది మాత్రమే హాజరుకాగా, సుమారు 30 మందికి పైగా గైర్హాజరయ్యారు. రెండో రోజు పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమానికి మధ్యాహ్నం 12 గంటలు దాటినా కేవలం 10 మంది సభ్యులు మాత్రమే రావడం గమనార్హం.

### అవగాహన లేకనా.. అలసత్వమా?

గ్రామాల్లో వార్డు సభ్యులకు తమ అధికారాలు, విధులు, పాలనాపరమైన



అంశాలపై అవగాహన కల్పించేందుకు అధికారులు ఈ ఐదు రోజుల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అయితే కీలకమైన ఈ శిక్షణను నిర్లక్ష్యం చేయడం పట్ల మండల స్థాయిలో చర్చ జరుగుతోంది. బాధ్యత గల పదవుల్లో ఉండి, శిక్షణకు గైర్హాజరవుతున్న సభ్యులపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. ప్రభుత్వం ప్రజా ధనాన్ని ఖర్చు చేస్తూ నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు గైర్హాజరు కావడం పట్ల సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది.

# ఘనంగా ఎమ్మెల్యే నాగరాజు జన్మదిన వేడుకలు

**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు జన్మదిన వేడుకలు పర్వతగిరి మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. మండల, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు, మండల అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్ తదితర ముఖ్య నాయకులు కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే నాగరాజు మరింత దూసుకుపోవాలని, వారు ఆయురారోగ్యాలతో ఉండాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ వివిధ విభాగాల నాయకులు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం వద్ద టపాసులు కాల్చి, మిఠాయిలు పంపిణీ చేసి పండగ వాతావరణంలో సంబరాలు జరుపుకున్నారు. ప్రజా సేవలో ఎమ్మెల్యే మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు నేతలు ఈ సందర్భంగా అభిలషించారు.

# సంతోషాల హోలీ..



**వరంగల్ వాయిస్, పరకాల:** రక్త సంబంధాల కంటే స్నేహ సంబంధాలు గొప్పవని చాటిచెప్పే రంగుల పండుగ 'హోలీ'ని పురస్కరించుకుని పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ పరకాల పట్టణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం హనుమకొండలోని తన నివాస ప్రాంగణంలో కాలనీ వాసులతో కలిసి ఆమె హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. పరస్పరం రంగులు పూసుకుంటూ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రంగుల పండుగ ప్రజలందరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం మరియు కొత్త ఉత్సాహాన్ని నింపాలని ఆకాంక్షించారు. పాత బాధలను, ద్వేషాలను మరిచిపోయి, కొత్త ఆశలతో, కొత్త రంగులతో జీవితాన్ని మరింత ఆనందమయంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. హోలీ పండుగ కేవలం రంగుల పండుగ మాత్రమే కాదని, మనుషుల మధ్య స్నేహాన్ని, ఐక్యతను పెంచే పండుగ అని ఆమె పేర్కొన్నారు. మరోసారి పరకాల పట్టణ ప్రజలందరికీ మరియు కాంగ్రెస్ శ్రేణులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో కాలనీ ప్రముఖులు, కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులకు టోపీల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో రోడ్లపై వ్యాపారాలు చేసుకునే నిరుపేదలను ఆదుకోవడానికి డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ముందుకొచ్చింది. బుధవారం చంద్రగ్రహణ మోక్షం అనంతరం, వేసవి తాపం నుంచి రక్షణ కల్పించే ఉద్దేశంతో రామన్నపేట పరిసరాల్లోని 20 మంది వృద్ధులు, చిరు వ్యాపారులకు ఉచితంగా టోపీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, వేసవికాలంలో వృద్ధులు, వ్యాపారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ఆ సమయంలో బయటకు రాకపోవడం శ్రేయస్కరమని తెలిపారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండటానికి ఎక్కువ మొత్తంలో నీటిని తాగాలని, బయటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. రోడ్లపై కూరగాయలు, పండ్లు, తినుబండారాలు విక్రయిస్తూ జీవనం సాగించే వారికి ఈ టోపీలు ఎంతో ఊరటనిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ శ్రవణ్, సభ్యులు రామ శ్రీనివాస్, రాజేష్, శైలజ, వీరనారాయణ,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి చేయూత



**వరంగల్ వాయిస్, ఏటూరునాగారం :** మండల కేంద్రం పరిధిలోని మానసపల్లికి చెందిన జగజాంపుల పూలమ్మ (65) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డాక్టర్ జాడి రామరాజు నేత తక్షణమే స్పందించారు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం సత్యం ఆధ్వర్యంలో మృతురాలి కుటుంబ సభ్యులకు 25 కేజీల బియ్యం అందజేశారు. నిరుపేద కుటుంబానికి ఈ కష్ట సమయంలో చిన్నపాటి సాయం అందించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జనగాం ఆనంద్, పాగే సమ్మయ్య, పాగే మల్లయ్య, అర్జున్, మృతురాలి కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఘనంగా చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

- హాజరైన డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి
- కోగిల్వాయి చంద్రగిరి గుట్టలపై ప్రత్యేక పూజలు
- స్వామివారిని దర్శించుకున్న భక్తులు



**వరంగల్ వాయిస్, దామెర :** మండల పరిధిలోని కోగిల్వాయి గ్రామ శివారులో గల చంద్రగిరి గుట్టలపై కొలువైన శ్రీ చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంచార్జ్, రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి, గ్రామ శ్రేయస్సుతో పాటు ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆ స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరగడం శుభసూచకమని పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో విజయచందర్ రెడ్డికి అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చుక్క వనిత మహేందర్, ఆలయ అధ్యక్షులు,పెరుగు కుమారస్వామి, ఛైర్మన్ రమాకాంత్, వైస్ ఛైర్మన్ పున్నం వేణు, డైరెక్టర్ గన్ను సతీష్, పాలకుర్తి శ్రీనివాస్, పెరుగు స్పందన, పున్నం చందు, పెరుక శ్రీను, గ్రామ వార్డు సభ్యులు, బీజేపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# కేంద్రంపై పోరుకు సిద్ధం

- 9న ఢిల్లీలో 'రైతు-కార్మిక పార్లమెంట్'
- 600 జిల్లాల్లో సార్వత్రిక సమ్మె సక్సెస్
- తదుపరి కార్యాచరణపై కీలక నిర్ణయం

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు సిద్ధమవుతున్నట్లు భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు వెల్లడించారు. మార్చి 9న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల వేదిక ఆధ్వర్యంలో 'రైతు–కార్మికుల పార్లమెంటు' నిర్వహించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర సమాఖ్యల ఉమ్మడి వేదిక సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెంకట్రాములు వివరించారు. ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా జరిగిన సార్వత్రిక సమ్మె 600 జిల్లాల్లో విజయవంతమైందని, సుమారు 30 కోట్ల మంది కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఇందులో భాగస్వాములయ్యారని పేర్కొన్నారు. ప్రభుత్వ అడ్డంకులు, అరెస్టులు, కేసులను ఎదుర్కొని ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపిన వారందరికీ ఈ సమావేశం అభినందనలు తెలిపింది.భవిష్యత్ పోరాటాల్లో ఈ క్రింది అంశాలపై ప్రధానంగా ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు. కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలి.



రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే చట్టం చేయాలి. ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా పునరుద్ధరించి, బలోపేతం చేయాలి. ప్రభుత్వం మొండి వైఖరి వీడనందున, రాబోయే రోజుల్లో పోరాటాలను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై మార్చి 9 సమావేశంలో పూర్తిస్థాయి కార్యాచరణను ఖరారు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పోరాటంలో రైతులు, కార్మికులతో పాటు యువకులు, మహిళలు, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు.

# మహిళా సంఘాల బలోపేతమే ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, శాయంపేట:** గ్రామాల్లో మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం శాయంపేట మండలంలోని పలు గ్రామాల్లో వివో మహిళా సమైక్య భవనాలు, ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడలు, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శాయంపేటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళా సంఘాల కోసం పక్కా భవనాలను నిర్మిస్తున్నామని, రాబోయే రోజుల్లో డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టబోతున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో రహదారి సౌకర్యాలను మెరుగుపరిచేందుకు అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం వేగంగా చేపడుతున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంపీడీవో ఫణి చంద్ర, ఏఎంసి వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్, మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, అధికార ప్రతినిధి చిందం రవి, గ్రామ శాఖ అధ్యక్షుడు వరదరాజు, సర్పంచులు వైనాల కుమారస్వామి, చింతల ఉమా రైపాల్, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైభవంగా చెన్నకేశవ స్వామి కళ్యాణోత్సవం

## స్వామివారిని దర్శించుకున్న ఇనగాల



**వరంగల్ వాయిస్, దామెర :** హనుమకొండ జిల్లా దామెర మండలం కోగిల్వాయి గ్రామంలో వెలసిన శ్రీ చంద్రగిరి చెన్నకేశవ స్వామి వారి జాతర బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన స్వామివారి కళ్యాణ మహోత్సవ వేడుకకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి జాతర చైర్మన్ రమాకాంత్, ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. కళ్యాణోత్సవం సందర్భంగా చంద్రగిరి గుట్టలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఇనగాల వెంకట్రామ్ రెడ్డితో పాటు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. దర్శనం అనంతరం ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. చెన్నకేశవ స్వామి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. జాతరను ఇంత ఘనంగా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను ఆయన అభినందించారు.

# ఆసరా పెన్షన్లలో 'కోత'..

## కటాక్షపూర్‌లో లబ్ధిదారుల ఆందోళన



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** నిరుపేదలకు అండగా నిలవాల్సిన ఆసరా పెన్షన్ల పంపిణీలో అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. ఆత్మకూరు మండలం కటాక్షపూర్ గ్రామంలో గత రెండు మూడు నెలలుగా పెన్షన్ల పంపిణీ సక్రమంగా జరగడం లేదని లబ్ధిదారులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం కంటే తక్కువగా నగదు ఇస్తూ, తమను మోసం చేస్తున్నారని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని వృద్ధులు, వితంతువులు, గీత, చేనేత కార్మికులకు ప్రభుత్వం నెలకు రూ. 2016, అలాగే వికలాంగులకు రూ. 4016 పెన్షన్ అందజేస్తోంది. అయితే, కటాక్షపూర్‌లో పెన్షన్ పంపిణీ చేసే సమయంలో లబ్ధిదారులకు కేవలం రూ. 2000, రూ.4000 మాత్రమే ఇస్తున్నారని సమాచారం. ప్రతి లబ్ధిదారుని వద్ద రూ. 16 కోత విధిస్తూ, చిల్లర లేదనే వంకతోనో లేదా ఇతర కారణాలతోనో ఆ మొత్తాన్ని పక్కదారి పట్టిస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ఒక్కో వ్యక్తి వద్ద 16 రూపాయలు అంటే, గ్రామం మొత్తం మీద వందలాది మంది లబ్ధిదారుల నుండి భారీ మొత్తంలో సొమ్ము పక్కదారి పడుతోందని వారు ఆరోపిస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, బీడీ వర్కర్లు, వికలాంగులు ఈ అక్రమాల వల్ల నష్టపోతున్నారు. సంబంధిత ఉన్నత అధికారులు ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని వారు కోరుతున్నారు. పెన్షన్ పంపిణీ చేసే ఉద్యోగిపై విచారణ జరిపి, లబ్ధిదారులకు రావాల్సిన పూర్తి సొమ్మును అందేలా చూడాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కటాక్షపూర్ గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# శ్రీ సాయి విజ్ఞాన భారతిలో 'హోలీ' సంబరాలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా 14వ డివిజన్ మణికంఠ కాలనీలోని శ్రీ సాయి విజ్ఞాన భారతి హైస్కూల్‌లో రంగుల పండుగ హోళీ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సామల శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని పరస్పరం రంగులు పూసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో హోళీ అత్యంత పురాతనమైన పండుగని పేర్కొన్నారు. ఈ పండుగ వెనుక ఉన్న పురాణ గాథను విద్యార్థులకు వివరించారు. హరినామ స్మరణ చేస్తున్న ప్రహ్లాదుడిని హతమార్చాలని చూసిన హిరణ్యకశపుడు, తన సోదరి హోళికా సహాయంతో మంటల్లో దహనం చేయాలని ప్రయత్నించగా.. దైవ సంకల్పంతో హోళికా మాత్రమే దహనమై ప్రహ్లాదుడు సురక్షితంగా బయటపడ్డాడని తెలిపారు. చెడుపై మంచి ఎప్పటికైనా విజయం సాధిస్తుందనే సత్యాన్ని హోళీ పండుగ చాటిచెబుతుందని, విద్యార్థులు కూడా ఇతరులకు హాని చేయకుండా సన్మార్గంలో నడవాలని సూచించారు. పిల్లలకు అత్యంత ఇష్టమైన పండుగ కావడంతో, పాఠశాలలో ఏటా ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం రంగుల కేళిలో మునిగితేలారు. పాఠశాల ప్రాంగణమంతా రంగులమయంగా మారి సందడిగా కనిపించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.స్వాతి, ఎం.రాధా, రిజ్వానా, ఫాతిమా, శ్రావణి, లతా శ్రీ, చందన, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోటగుళ్లకు నూనె క్యాన్ల వితరణ



**వరంగల్ వాయిస్, గణపురం:** చారిత్రక ప్రసిద్ధిగాంచిన కాకతీయుల కళాక్షేత్రం, శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయానికి (కోటగుళ్లు) నూనె క్యాన్లను వితరణగా అందజేశారు. గణపురం మండల కేంద్రానికి చెందిన దివంగత పెరుమాండ్ల కుమారస్వామి గౌడ్ జ్ఞాపకార్థం, వారి కుమారుడు పెరుమాండ్ల విష్ణువర్ధన్ గౌడ్ –రజిత దంపతులు సుమారు రూ.8 వేల విలువైన నూనె క్యాన్లను ఆలయానికి బహుకరించారు. విష్ణువర్ధన్ తల్లి సాంబలక్ష్మి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, ఆలయ నిర్వహణ కోసం ఈ నూనె క్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారికి ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేసి, స్వామివారి తీర్థప్రసాదాలను వితరణ చేశారు. ఆలయంలో నిత్య దీపారాధన కోసం ఉదారంగా నూనె క్యాన్లను అందజేసిన విష్ణువర్ధన్ గౌడ్ కుటుంబ సభ్యులకు కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. ఇలాంటి సేవా కార్యక్రమాలు ఆలయ అభివృద్ధికి, నిర్వహణకు ఎంతో దోహదపడతాయని కమిటీ సభ్యులు కొనియాడారు.

# ఘనంగా హోలీ సంబరాలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** వసంత కాలం రాకతో వచ్చే రంగుల పండుగ హోలీని కాశీబుగ్గలో ఘనంగా నిర్వహించారు. బుధవారం కాశిబుగ్గ చౌరస్తాలో కాశీబుగ్గ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో సంఘ సభ్యులు, నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఒకరికొకరు రంగులు పూసుకుంటూ, ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కులమతాలకు అతీతంగా, స్నేహభావంతో జరుపుకునే ఈ హోలీ పండుగ అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు గుళ్లపల్లి రాజకుమార్ తో పాటు గోరంటల మనోహర్, పోతన లక్ష్మీనరసయ్య, మాటేటి విద్యాసాగర్, బేతి అశోక్, వేముల నాగరాజు, బండారి రాజేశ్వరరావు, ఊరుగొండ రవీందర్, మంతెన అమ్రేష్, గోరంటల శ్రీధర్, కార్యవర్గ సభ్యులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను జయప్రదం చేశారు.

# ఘనంగా ఎమ్మెల్యే నాగరాజు జన్మదిన వేడుకలు

## శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు జన్మదిన వేడుకలు బుధవారం హనుమకొండ సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అత్యంత వైభవంగా జరిగాయి. తమ అభిమాన నాయకుడి పుట్టినరోజును పురస్కరించుకుని నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం నుండే క్యాంపు కార్యాలయం సందడిగా మారింది. ఎమ్మెల్యే నాగరాజుకు పుష్పగుచ్ఛాలు, పుస్తకాలు, రైటింగ్ ప్యాడ్స్ అందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధికారులు,ప్రజాప్రతినిధులు ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

6
WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, మార్చి 04, 2026

## మేడారంలో గుండేటి నరేందర్ హోలీ సంబరాలు



**వరంగల్ వాయిస్, మేడారం/ కాశిబుగ్గ:** ప్రకృతి ఒడిలో, పవిత్ర క్షేత్రమైన మేడారంలో 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ తన మిత్రబృందంతో కలిసి బుధవారం హోలీ వేడుకలను అత్యంత ఉత్సాహంగా జరుపుకున్నారు. రంగుల పండుగను పురస్కరించుకుని వీరంతా మేడారం చేరుకుని ఒకరికొకరు రంగులు పూసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హోలీ పండుగ స్నేహానికి, ఐక్యతకు ప్రతీక అని, మిత్రులందరితో కలిసి మేడారంలో జరుపుకోవడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. రంగుల కేళి అనంతరం అందరూ కలిసి ఉల్లాసంగా గడిపారు. ఈ హోలీ వేడుకల్లో కార్పొరేటర్ నరేంద్ర కుమార్ తో పాటు మాజీ కౌన్సిలర్ ధూపం సంపత్,శ్వేత బాబు, వెల్దండి లక్ష్మణ్, మార్త ఆంజనేయులు, రాచర్ల శ్రీనివాస్, దాసరి ప్రకాష్, తుమ జన్నయ్య, కూరపాటి రాజు, దాసరి శ్రీనివాస్, తోట బాలరాజు,పలువురు నాయకులు,మిత్రబృందం పాల్గొన్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** వరంగల్ జిల్లా "వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ – 2026" జిల్లా స్థాయి పోటీలు వరంగల్, లాల్ బహదూర్ కాలేజీ లో ఫిబ్రవరి 6న(శుక్రవారం) నిర్వహిస్తునట్టు, విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు, దీనికి సంబందించిన గోడ పత్రిక ను వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రంతో కలిసి అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎస్.జ్యోతి, ఆచార్య వై.వెంకయ్య, లాల్ బహదూర్ కాలేజీ జాతీయ సేవ పథకం ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎ.రఘువేందర్ రెడ్డి, ఎచ్.రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.

## చిలువేరు రాజ్ కుమార్ కు ఉగాది జీవిత సాఫల్య పురస్కారం



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్ కుమార్ కు ప్రతిష్టాత్మకమైన "భారత్ గౌరవ్ ఉగాది జీవిత సాఫల్య పురస్కారం" దక్కింది. విశాఖపట్నం గ్లోబల్ ఫౌండేషన్ మెమోరియల్ ఆర్గనైజేషన్ ఈ అవార్డును ప్రకటించినట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కె.కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, సామాజిక రంగాల్లో డాక్టర్ రాజ్ కుమార్ చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. మార్చి 14న హైదరాబాద్‌లో నిర్వహించబోయే ఒక ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖుల సమక్షంలో ఈ పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేయనున్నారు. చరిత్ర విభాగాధిపతిగా కొనసాగుతున్న రాజ్ కుమార్ కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న సంస్థ నుండి ఈ పురస్కారం లభించడం పట్ల కాకతీయ విశ్వవిద్యాలయంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.వర్సిటీకి చెందిన పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆయనను వ్యక్తిగతంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, విశ్వవిద్యాలయానికి మరింత గుర్తింపు తీసుకురావాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

# లక్ష్యసాధనలో పోటీతత్వం కీలకం

▪ కేయూ వీసీ ఆచార్య ప్రతాప్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కేయూ :** విద్యార్థులు చిన్ననాటి నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకుని, నిరంతర శ్రమతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కేయూలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) వరంగల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వందేమాతరం' పోటీల బహుమతి ప్రదానోత్సవం సందడిగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తూ వారికి బహుమతులు అందజేశారు. బీవీపీ అధ్యక్షుడు డాక్టర్ సుధీర్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర కార్యదర్శి శివరామకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పరిషత్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ వేడుకలో సుమారు 30 పాఠశాలల నుంచి 300 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల దేశభక్తి గీతాలాపనలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రఘు సతీష్ కుమార్ (రాష్ట్ర ఉపాధ్యక్షుడు), నరసింహాచారి (కామర్స్ ప్రిన్సిపాల్), కె.సత్యనారాయణ, బి.వెంకట్ రెడ్డి, చంచల్ అగర్వాల్, గోవిందరాజులు, సంతోష్ రెడ్డి, విసి.రామారావు, పాఠశాలల కరస్పాండెంట్లు రామచంద్రమూర్తి, సురేష్, చక్రపాణి పాల్గొన్నారు.

## ముస్త్యాలపల్లిలో 'ఈకో ఫ్రెండ్లీ' హోలీ



**వరంగల్ వాయిస్, నడికూడ:** మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామ పాఠశాల విద్యార్థులు పర్యావరణ హితంగా హోలీ పండుగను జరుపుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. రసాయన రంగుల వినియోగం వల్ల కలిగే నష్టాలను గుర్తిస్తూ, ఈసారి పూర్తిగా ప్రకృతి సిద్ధమైన రంగులతోనే రంగుల పండుగను ఘనంగా నిర్వహించారు. రసాయన రంగులకు స్వస్తి పలికిన విద్యార్థులు, తమ చుట్టూ ఉండే సహజ పదార్థాలతో రంగులను తయారు చేసి ఆకట్టుకున్నారు. బీట్‌రూట్ సహాయంతో ఎరుపు రంగును, క్యారెట్ ఉపయోగించి నారింజ రంగును, మోదుగ పూలతో పసుపు రంగును, పాలకూరతో ఆకుపచ్చ రంగును స్వయంగా తయారు చేసి హోలీ ఆడారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుకూరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. రసాయన రంగులు చర్మానికి, కళ్లకు, పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తాయని వివరించారు. మన పండుగలను పర్యావరణానికి ఇబ్బంది కలగకుండా జరుపుకోవడం మన అందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. గతంలో కూడా ఈ పాఠశాల విద్యార్థులు ఎకో ఫ్రెండ్లీ గణపతి, బతుకమ్మ, రాఖీ వేడుకలతో తమ ప్రత్యేకతను చాటుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ మేకమల్ల వెంకటేష్, ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులతో కలిసి ప్రకృతి రంగులు చల్లుకుంటూ హోలీ సంబరాలలో పాల్గొన్నారు. విద్యార్థుల ఈ వినూత్న ప్రయత్నంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పావని, సత్యపాల్, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ప్రజాపాలన కార్యక్రమాలకు సిద్ధంగా ఉండాలి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** హనుమకొండ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.శేషాద్రి బుధవారం ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులను పరిశీలించిన ఆయన, వివిధ శాఖల పనితీరుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎం.శ్రీనివాస్ రెడ్డి, ఏపీవో రాజిరెడ్డిలతో కలిసి ఉపాధి హామీ పనుల పురోగతిపై సీఈవో చర్చించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారుల ఇళ్లను ఎప్పటికప్పుడు సందర్శించి, నిర్మాణ పనులు పూర్తికాగానే వెంటనే బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 6వ తేదీ నుంచి 12 వరకు నిర్వహించబోయే ప్రజాపాలన కార్యక్రమాలకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని సీఈవో స్పష్టం చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా చేపట్టిన ఎంపీ సెక్టార్, జడ్పీ సెక్టార్ పనులను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. చేయూత పింఛన్ల పంపిణీ తీరుపై చర్చించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సీఈవో వెంట ఎంపీడీవో ఎం.శ్రీనివాస్ రెడ్డితో పాటు కార్యాలయ పర్యవేక్షకులు ఏ.వసంతారావు, మండల పంచాయతీ అధికారి కె.యోగిత, ఏపీవో రాజిరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎర్రగట్టు స్వామివారి సన్నిధిలో ఎమ్మెల్యే నాగరాజు

- జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు
- ఘనంగా స్వాగతం పలికిన అర్చకులు



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** శ్రీ ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు రెండో రోజు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తన జన్మదినం సందర్భంగా బుధవారం ఎర్రగట్టు క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే నాగరాజుకు అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆలయ ఈవో వెంకట్రావు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు వేదాంతం పార్థసారథి, ఆరుట్ల శ్రీధరచార్యులు, జాతర ఉత్సవ కమిటీ సభ్యులు గరిగే రమ్యకృష్ణరాజు, జన్ను రమేష్, గోపరాజు కనకస్వామి, వెలిసోజు రాజశేఖర్, వీసం రవీందర్ రెడ్డి, పెద్దమ్మ జితేందర్, మార్కారాజు, తోట శ్రీనివాస్, చిట్యాల రమేష్, సదగంటి సదానందం, సంఘాల సుమన్, గండి సందీప్ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి, 66వ డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్, సీనియర్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి, పెద్దమ్మ నరసింహ రాములు, మండల మీడియా ఇంచార్జి బిగుల్లా సురేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యశ్ టాక్సిస్ జూన్‌కి వాయిదా





యశ్ హీరోగా రానున్న తాజా సినిమా 'టాక్సిస్' గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. 'ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోనప్స్' అనేది ఉప శీర్షిక. భారీ స్థాయిలో రూపొందుతోన్న ఈ చిత్రం వాయిదా పడింది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ ఓ పోస్ట్ పెట్టింది. మొదట ఈ మూవీని మార్చి 19న విడుదల చేయాలని భావించారు. కానీ, ప్రస్తుతం పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా దీన్ని జూన్ 4కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. 'మేం ఈ 'టాక్సిక'ను అన్ని భాషల్లో విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లిష్‌లోనూ రిలీజ్ చేయాలి. ప్రస్తుతం పశ్చిమాసియాలో పరిస్థితులు అందరికీ తెలిసినవే. ఇలాంటి సమయంలో సినిమాను విడుదల చేయడం సరైన నిర్ణయం కాదు. అందుకే వాయిదా వేస్తున్నాం' అని నిర్మాణ సంస్థ పేర్కొంది. ఇక ఇందులో యశ్‌తో పాటు అయిదుగురు హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నదియా పాత్రలో కియారా కనిపించ నుండగా హ్యూమా ఖురేషీ ఎలిజిబెత్‌గా, నయనతార గంగ పాత్రలో, రెబెకాగా తారా సుతారియా అలరించనున్నారు. మెలిసా అనే పాత్రలో రుక్మిణి వసంత్ ఆకట్టుకోనున్నారు. ఇటీవల విడుదలైన టీజర్ చర్చనీయాంశమైన విషయం తెలిసిందే.

## ఓ మంచి చిత్ర్రాన్ని చూస్తారు

**- నటుడు శివాజీ వెల్లడి**

శివాజీ, లయ మరోసారి నవ్వులు పంచేందుకు సిద్ధమయ్యారు. వారిద్దరూ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' సుధీర్ శ్రీరామ్ దర్శకుడు. 'ఈటీవీ విన్' ఒరిజినల్ మూవీగా రూపొందిన ఈ సినిమా థియేటర్లలో ఈనెల 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. అందులో శివాజీ మాట్లాడుతూ మన దేశంలో వినోదం అనగానే సినిమానే గుర్తుకొస్తుందన్నారు. ఈటీవీ విన్ నుంచి సినిమా వస్తుందంటే ఆడియన్స్‌లో ఆసక్తి రెట్టింపు అవుతుంది. వారికి మరింత వినోదం ఇవ్వడం కోసం ఈటీవీ విన్ ప్రత్యేక ఆఫర్‌ను కూడా ప్రకటించింది. సింగిల్ స్క్రీన్స్‌లో రూ.499కే నాలుగు టికెట్స్‌తోపాటు లార్జ్ పాప్‌కార్న్, ఎంపిక చేసిన మల్టీప్లెక్స్‌ల్లో రూ.799కే నాలుగు టికెట్స్‌తోపాటు లార్జ్ పాప్‌కార్న్ అందించాలని నిర్ణయించుకుంది. సినిమా అందరికీ చేరువకావాలనే ఈ ఆఫర్‌ను 'ఈటీవీ విన్' బిజినెస్ హెడ్ సాయికృష్ణ ప్రకటించారు. ఈ సినిమా కచ్చితంగా మీ అందరికీ నచ్చుతుంది. కుటుంబసమేతంగా చూసి ఎంజాయ్ చేసే చిత్రమిది. ఈ సినిమాకు మరింత కష్టపడి వర్క్ చేశాను. వాళ్లకు మాట ఇచ్చినట్లు మంచి చిత్రం తీశాను. ఈ ఆఫర్‌ను మాత్రం అందరూ గుర్తుపెట్టుకోండి అని అన్నారు.







## మణిపురి బూంగ్‌కు బ్రిటిష్ అకాడమీ అవార్డు

మణిపురి భాషలో తెరకెక్కిన 'బూంగ' చిత్రం ప్రతిష్టాత్మకమైన బ్రిటీష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్ 2026 అవార్డుల్లో సత్తా చాటిన సంగతి తెలిసిందే. ఈ చిత్రం 'బెస్ట్ చిల్డ్రన్ అండ్ ఫ్యామిలీ ఫిల్మ' కేటగిరీలో విజేతగా నిలవడమే కాకుండా బాఫ్టా గెలుచుకున్న తొలి భారతీయ సినిమాగా చరిత్ర సృష్టించింది. ఈ అద్భుత విజయం తర్వాత మేకర్స్ ఈ చిత్రాన్ని దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీతో పాటు ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ప్రపంచ వేదికపై భారతీయ ప్రాంతీయ సినిమా సత్తాను చాటిన ఈ చిత్రం మార్చి 6న థియేటర్లలోకి రాబోతుంది. ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ప్రముఖ నిర్మాతలు ఫర్హాన్ అక్తర్, రితేష్ సిధ్వానీ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించగా, లక్ష్మీప్రియ దేవి దర్శకత్వం వహించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే, మణిపూర్‌లోని ఒక మారుమూల గ్రామానికి చెందిన 'బూంగ' అనే చిన్నారి చుట్టూ కథ తిరుగుతుంది. తన తల్లి ముఖంలో చిరునవ్వు చూడాలని తపించే ఆ బాలుడు, ఆమెకు ఇచ్చే అత్యంత విలువైన బహుమతి తన తండ్రిని తిరిగి ఇంటికి తీసుకురావడమేనని బలంగా నమ్ముతాడు. ఈ క్రమంలో తన స్నేహితుడితో కలిసి తండ్రి కోసం అతడు చేసే అన్వేషణ, ఆ ప్రయాణంలో ఎదురయ్యే అనుభవాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. దర్శకురాలు లక్ష్మీప్రియ దేవి చిన్నపిల్లల అమాయకత్వాన్ని, వారిలోని స్వచ్ఛమైన ప్రేమను అత్యంత సహజంగా వెండితెరపై ఆవిష్కరించారు.

## పెద్ది రైరై రారా పాటకు భారీగా లైక్స్

పాన్ ఇండియా స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సన దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. విలేజ్ బ్యాక్‌డ్రాప్, ఎమోషన్, మాస్ ఎలిమెంట్స్ కలయికతో రూపొందుతున్న ఈ సినిమా నుంచి వచ్చిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా విడుదలైన సెకండ్ సింగిల్ 'రై రై రా రా' లిరికల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారి రికార్డులు సృష్టిస్తోంది. ఈ పాటకు ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూర్చి స్వయంగా ఆలపించడం విశేషం. అనంత శ్రీరామ్ అందించిన సాహిత్యం మాస్, మోటివేషనల్ టచ్‌తో ఆకట్టుకుంటోంది. జానీ మాస్టర్ రూపొందించిన కొరియోగ్రఫీ ఈ సాంగ్‌కు హైలైట్‌గా నిలిచింది.ముఖ్యంగా రామ్ చరణ్ వేసిన గ్రేస్‌ఫుల్ స్టెప్పులు, ఫాస్ట్ మూమెంట్స్ అభిమానులను ఫిదా చేస్తున్నాయి. కొందరు అభిమానులు ఆయన డ్యాన్స్‌ను 'చిరుత' రోజుల్ని గుర్తు చేసేలా ఉందని సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. ఈ పాటపై మెగాస్టార్ చిరంజీవి కూడా ప్రశంసలు కురిపించారు. 'రై రై రా రా' సాంగ్ ఎనర్జీ, ఎమోషన్, సినీమాటిక్ బ్రిలియన్స్‌తో అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. రామ్ చరణ్ డ్యాన్స్ తనను ఎంతో గర్వపడేలా చేసిందని, స్క్రీన్‌పై ఆయన గ్రేస్ ప్రత్యేకంగా మెరిసిందని వ్యాఖ్యానించారు. దర్శకుడు బుచ్చిబాబు సానా, ఏఆర్ రెహమాన్ సంగీతం, జానీ మాస్టర్ కొరియోగ్రఫీ, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు, లిరిసిస్ట్ అనంత శ్రీరామ్ అందరి కృషి వల్లే ఈ సాంగ్ మరోస్థాయికి వెళ్లిందని అభినందించారు. ఈ ప్రశంసలకు బుచ్చిబాబు సానా భావోద్వేగంగా స్పందిస్తూ, మెగాస్టార్ నుంచి వచ్చిన మాటలు జీవితాంతం గుర్తుండిపోతాయని తెలిపారు.



# 6 నుంచి ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 99 రోజుల 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక'ను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు పటిష్ట కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులకు ఆమె దిశానిర్దేశం చేశారు. ఈనెల 6వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు ఐదు దశల్లో 99 రోజులపాటు వివిధ శాఖలకు సంబంధించిన పది ముఖ్య అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 6 నుంచి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల పరిష్కార అంశంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 6 నుంచి 11 వరకు ఆరోగ్యం–ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తులు అంశంపై ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు, చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఏప్రిల్ 13 నుంచి 18 వరకు సురక్షితంగా చేరుకోండి కార్యక్రమం హోం, రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన, ట్రాఫిక్ నియమాల కఠిన అమలు, హెల్మెట్–సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఏప్రిల్ 20 నుంచి ఏప్రిల్ 25 వరకు సంక్షేమం అంశంపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు మరియు ఇందిరమ్మ ఇల్లు పథకం అమలు స్థితిపై సమీక్షలు నిర్వహించి, లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 27 నుంచి మే 2 వరకు పిల్లల భద్రత మరియు రక్షణ–డ్రగ్స్‌కు నో కార్యక్రమం పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాల రూపంలో అమలు చేయబడుతుందని చెప్పారు. మే 4 నుంచి మే 9 వరకు రైతులు (వ్యవసాయం( అంశంపై వ్యవసాయ, రెవెన్యూ, నీటిపారుదల, విద్యుత్ శాఖలు సమన్వయంతో రైతులకు సాగు సలహాలు, ఎరువులు–విత్తనాల లభ్యత, సాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా అంశాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మే 11 నుంచి మే 16 వరకు విద్య అంశంపై పాఠశాలల మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, బోధన నాణ్యతపై సమీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. మే 18 నుంచి మే 23 వరకు యువత మరియు క్రీడలు అంశంపై క్రీడా పోటీలు, యువజనోత్సవాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు చేపట్టాలని సూచించారు. మే 25 నుంచి మే 30 వరకు మహిళలు అంశంపై మహిళా సాధికారత, స్వయం ఉపాధి, స్వయం సహాయక సంఘాల బలోపేతం, రుణాల సద్వినియోగంపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జూన్ 1 నుంచి జూన్ 12 వరకు పర్యావరణం అంశంపై వృక్షారోపణ, ప్లాస్టిక్ నియంత్రణ, పచ్చదనం పెంపు కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు.

ఈ 99 రోజుల కార్యాచరణ గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఐదు దశల్లో అమలు చేయబడుతుందని తెలిపారు. మార్చి 6న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో కార్యాచరణపై మంత్రుల సమీక్ష సమావేశం నిర్వహించబడుతుందని వెల్లడించారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలతో సిద్ధంగా హాజరుకావాలని ఆదేశించారు. మార్చి 6 నుండి 16 వరకు నిర్వహించనున్న పరిశుభ్రత కార్యక్రమాలపై ప్రత్యేక దిశానిర్దేశం చేస్తూ ప్రతి గ్రామం, మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, రహదారుల వెంట పిచ్చి మొక్కల తొలగింపు, చెత్త నిర్మూలన, తడి–పొడి చెత్త వేరు సేకరణను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

మున్సిపాలిటీలలో 100 శాతం పన్ను వసూళ్ల లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని అన్నారు. 99 రోజుల ప్రణాళిక జిల్లాలో ఆదర్శవంతంగా అమలై రాష్ట్రానికి మాదిరిగా నిలవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో డీఎఫ్ఓ అనుజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి (రెవెన్యూ), అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ వైవీ గణేష్, డీఆర్ఓ విజయలక్ష్మి, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, ఉప కమిషనర్ ప్రసన్న రాణి, నర్సంపేట, వరంగల్ ఆర్డీఓలు ఉమారాణి, సుమ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.





## బిజిలీ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- ప్రచార వాహనానికి జెండా ఊపి ప్రారంభం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యువజన పథకం కింద గృహ విద్యుత్ వినియోగదారులు తమ ఇండ్ల రూఫ్ టాప్ లపై సోలార్ ప్లాంట్ ఏర్పాటు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సూచించారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకానికి సంబంధించి జిల్లాలో అవగాహన కల్పించేందుకు తెలంగాణ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్మెంట్ కార్పొరేషన్ (టీజీ రెడ్ కో ) ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార వాహనాన్ని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ ఒక కిలో వాట్ సోలార్ ప్యానల్ కు 30 వేల రూపాయలు, రెండు కిలో వాట్స్ సోలార్ ప్యానెల్ కు 60 వేల రూపాయలు, మూడు కిలోవాట్లు అంతకంటే ఎక్కువ ఉన్నవాటికి 78 వేలు ఖర్చవుతుందని తెలిపారు. గృహ విద్యుత్ వినియోగదారులు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సౌకర్యం సద్వినియోగం చేసుకోవడం ద్వారా గృహ అవసరాలకు సరిపోవుగా మిగిలిన విద్యుత్తును పవర్ గ్రిడ్ కు అందజేయడం ద్వారా ఆదాయం కూడా పొందే అవకాశం లభిస్తుందన్నారు. ఈ పథకానికి సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ ప్రచార వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళా సమాఖ్యల ద్వారా కూడా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి, టీజీ రెడ్ కో అధికారి మహేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యం

- సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

**వరంగల్ వాయిస్, నక్కలగుట్ట :** హనుమకొండ, నక్కలగుట్టలోని బుధవారం ఎన్పీడీసీఎల్ విద్యుత్ భవన్ కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించిన లైన్ మెన్ దివస్ కార్యక్రమంలో పాల్గొని విద్యుత్ అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా పుష్పగుచ్ఛాలతో నివాళులు అర్పించారు. అనంతరం సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో గాలివాన, ఎండలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తూ ప్రత్యక్షంగా వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందిస్తున్న లైన్‌మెన్, ఓఎం సిబ్బంది సేవలు అనిర్వచనీయమని కొనియాడారు. ప్రతి ఒక్కరు భద్రత సూత్రాలు పాటించాలని, భద్రతే ముఖ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, సీఈలు, సీజీఎం, జాయింట్ సెక్రటరీ కంపెనీ సెక్రటరీ , జీఎంలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గోవిందరాజ స్వామి డోలోత్సవం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** చరిత్రకు నిలయమై నగర నడిమధ్యన గోవిందాద్రి కొండపై స్వయంభుగా వెలసిన శ్రీదేవి భూదేవి నీలాదేవి సతీ సమేతుడైన శ్రీ గోవిందరాజ స్వామి దేవస్థానంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు కన్నుల పండువగా డోలోత్సవం నిర్వహించారు. గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులను ఆలయ నుంచి పల్లకి సేవలో మేళ తాళాలతో మంగళ వాయిద్యాలతో అశేష భక్తజన సమూహంతో ఊరేగింపుగా గట్టుపైకి తీసుకెళ్లారు. అక్కడ స్వామివారికి వసంతోత్సవం కార్యక్రమం ఎంతో వైభవపేతంగా నిర్వహించారు.



ఆలయ కార్య నిర్వహణ అధికారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. శ్రీ గోవిందరాజ స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాస స్వామి ఆధ్వర్యంలో గుట్టపైన స్వామివారికి వసంతోత్సవాన్ని భక్తజన సమూహం ఎదుట వైభవంగా నిర్వహించారు.

ఆలయ అర్చకులు వారియోగుల లక్ష్మణస్వామి, ప్రసాద్, జగన్నాథ వెంకటేశ్వర్లు, వరయోగుల సాయి మనోజ్ స్వామి, వరయోగుల వెంకటేశ్వర్ స్వామి, తాదూరి గోపి స్వామి, రమేష్ స్వామి, టం టం వేణుగోపాల స్వామి, దయాకర్ స్వామి, వరయోగుల నరేష్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీ గోవిందరాజస్వామి పాలకవర్గ సభ్యులు దౌడు నాగరాజు, గూడ శారద, గుల్లపెల్లి



రామకృష్ణ, యాట సత్యనారాయణ, ఆలయ సిబ్బంది శ్రీనివాస్ తో పాటు పెద్ద ఎత్తున స్థానిక మహిళలు మంగళహారతులతో స్వామివారిని దర్శించుకుని తీర్థ గోప ప్రసాదాలను స్వీకరించారు. స్వామివారికి వసంతోత్సవ సందర్భంగా గిర్మాజీపేట వాస్తవ్యులు ప్రముఖ న్యాయవాది ఓడపల్లి శ్యామ్ కృష్ణ శ్రీ గోవిందరాజ స్వామికి పట్టు వస్త్రములను సమర్పించారు. డోలోత్సవం సందర్భంగా గోవిందరాజుల గుట్ట చుట్టూ ట్రాఫిక్ నిబంధనలు విధించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com